క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

రామగిరి: మండలంలోని రామయ్యపల్లెకు చెందిన వార్డు మాజీ సభ్యుడు పెండ్రు సుమంత్ రెడ్డి మంగళవారం జెడ్పీచైర్మన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు సమక్షంలో పార్టీలో చేరారు. రామయ్యపల్లె గ్రామాభివృద్ధి కేసీఆర్ నేతృత్వంలో పుట్ట మధుతోనే సాధ్యమవుతుందని భావించి బీఆర్ఎస్‌లో చేరినట్లు సుమంత్‌రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, కన్నూరి సతీశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ యువకులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు జహీర్, ముజీబ్, బిలాల్, ఫయాజ్, షానవాజ్, సుఫియాన్, జునైద్ ఉన్నారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

రామగిరి: సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న బతుకమ్మ, ఫ్యామిలీడే వేడుకల ఏర్పాట్లను మంగళవారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు పరిశీలించారు. బతుకమ్మ సంబరాలు, ఫ్యామిలీ డే వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్తమ బతుకమ్మ విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఓటూ జీఎం రఘుపతి, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, సివిల్ డీజీఎం పద్మరాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్ఓ లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరిటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ పరిశీలించారు. సీఐ వెంట కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గౌరవ వేతనం చెల్లించండి

రామగుండం: పురపాలక సంఘాల్లోని ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం చెల్లించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ బుఖ్య రామ్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన రామగుండంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేల మాదిరిగానే కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు అన్ని అలవెన్సులు చెల్లించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

అవకాశం ఇస్తే పోటీచేస్తా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే బరిలో ఉంటానని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం



షీల్డు అందజేస్తున్న మన్మోహన్

జ్యోతినగర్: క్రీడలతో ఆరోగ్యం లభిస్తుందని సర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, విద్యార్థుల రాజకీయ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తమ్మెర మన్మోహన్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొదటి స్థానంలో నిలిచిన ఎన్టీపీసీ తెలంగాణ స్పోర్ట్స్ క్లబ్ వాలీబాల్ జట్టుకు బహుమతితో పాటు నగదు పారితోషకం అందించారు. రెండో స్థానంలో ఎన్టీపీసీ ఎ టీం, మూడో స్థానంలో గోలివాడ జట్టు విజయం సాధించాయి.

✦ పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని రాజ్యలక్ష్మి గార్డెన్‌లో 21న జరిగే విశ్వరూప సన్నాహక జిల్లా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కలువల శరత్ ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. పట్టణంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సారెస్పీ కాలువకు గండిపై నిరసన

- దిగువకు సాగునీరందని వైనం
- కెనాల్ వద్ద పది గ్రామాల రైతుల ఆందోళన



ఎస్సారెస్పీ కాలువకు పడిన గండి



కాలువ పక్కన నిరసన తెలుపుతున్న రైతులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 27ఎల్ కేంద్రం వద్ద ఎస్సారెస్పీ కాలువ లైనింగ్ పగిలిపోయి గండిపడడంతో వరద నీరు దిగువ గ్రామాల సాగు భూములకు అందడం లేదు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం గండిపడిన ప్రాంతానికి చేరుకొని నిరసన తెలిపారు. ప్రస్తుతం పత్తి పంటకు సాగునీరు అందకపోవడంతో పైరు ఎదుగుదల లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత ఎస్సారెస్పీ అధికారులకు రైతులు మొరపెట్టుకున్నప్పటికీ నెల గడువు కోరడమే తప్ప పునరుద్ధరణ పనులు మాత్రం చేపట్టడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు. నెలక్రితం మండల సర్వసభ్య సమావేశంలో సైతం ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారంరోజుల్లోగా గండిని పూడ్చుతామని హామీ ఇచారు. కానీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు సకాలంలో స్పందించకుంటే పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని రైతులు పేర్కొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలో 19న నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ దేశ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ హాజరుకానున్నారని పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు సానుభూతిపరులు అత్యధిక మంది తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ సభ్యులు ఉట్ల వరప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు కలువల శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి రాజలింగం, బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దన్నాయక్ దామోదర్‌రావు, ప్రజాప్రతినిధులు అన్నయ్యగౌడ్, ప్రకాష్‌రావు, అబ్బయ్యగౌడ్, సాయిరి మహేందర్, కిషోర్, రఫీక్, రాజు, రాజయ్య, తిరుపతి, ప్రదీప్, దేవేందర్, రామన్న, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, గజబీంకార్ శ్రీనివాస్, సత్యం, రమేశ్‌గౌడ్, సతీశ్ పాల్గొన్నారు.

ఓదెల: పెద్దపల్లిలో 19న జరిగే రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఓదెలలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, జిల్లా నాయకులు చీకట్ల మొండయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుప్పాల శంకర్, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు రౌతు మనోజ్ క్రాంతివీర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, వైద్యులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబింద్ సింగ్ హెచ్చరించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రిన్సిపాల్ హిమబిండ్‌సింగ్, కన్వీనర్‌గా వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, సభ్యులుగా గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్, రామగుండం కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, హెచ్‌ఓడీలు అనిల్‌రాహులే, షరీఫ, శ్రీదేవి, అనంతబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, మోడికోలు రుత్విక్, సుప్రియ, కాలేజీలోని పలు విభాగాల అధికారులు ఎండీ.షరీఫ్, పద్మలత, మరో ప్రతినిధి చంద్రమౌళిని నియమించారు. మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మంథని, ముత్తారం మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని ఎక్లాస్‌పూర్, గాజులపల్లి, లక్కేపూర్, చిన్నఓదాల, అడవిసోమన్‌పల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి, సీతంపల్లి, శాత్రాజ్‌పల్లి గ్రామాల నుంచి సుమారు వంద మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంథనిలో ఎమ్మెల్యే డి.శ్రీధర్ బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రామగిరి మండలం నుంచి..

రామగిరి: మండలంలోని ఆదివారంపేటకు చెందిన ఉమ్మడి ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు మైదం వరప్రసాద్, లద్నాపూర్ కు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు పొన్నం సత్యనారాయణగౌడ్, కిషన్ రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, మండల అధ్యక్షుడు రోడ్డ బాపు, సీనియర్ నాయకులు బొల్లపల్లి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు బీఆర్ఎస్ నాయకులకే పరిమితం



గ్రామస్తులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: నిరుపేద ప్రజలకు ఇవ్వాల్సిన ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ నాయకులకే కట్టబెడుతూ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మారం మండలం కటికెనపల్లిలో మంగళవారం ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన తీరును ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బొనగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి లక్ష్మణ్‌కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, లావుడ్య రూప్లానాయక్, యూత్ మండల అధ్యక్షుడు గందం మహిపాల్, ఈదుల రాంగోపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రేండ్ల నరేశ్, దాసరి ఓదేష్, అజయ్, అంజన్న, రాజేశం పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే నాయకత్వం కావాలి



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి లేని పాలనను దేశానికి అందిస్తున్నారని, ప్రజలకు అంకితభావంతో పనిచేసే నాయకత్వం కావాలని, అలాంటి నాయకత్వంలో ఉన్న పార్టీ బీజేపీ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల సమావేశానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతర పార్టీ అసంతృప్తులు పార్టీ కండువా కప్పుకోలేదు, బీజేపీ టికెట్ తనకే వస్తుందని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. మూడురోజుల్లో పార్టీ టికెట్‌ను అధిష్టానవర్గం ప్రకటిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ 60ఏళ్లలో ప్రజలకు చేసింది ఏమిటో చెప్పాలని, ఆరుగ్యారెంటీ కార్డులతో ఓట్లను అడిగేందుకు వెళ్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మండలాధ్యక్షుడు కడారి అశోక్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి ఆది కేశవరావు, పట్టణ అధ్యక్షుడు రాజన్న, లింగారెడ్డి, చాతరాజు రమేశ్, మహేందర్, తిరుపతి, వెంకటరామ్‌రెడ్డి ఉన్నారు.

డిస్పెన్సరీలో మౌలిక వసతులు కల్పించండి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని సెంటనరీకాలనీ డిస్పెన్సరీలో మౌలిక వసతులతోపాటు సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు అరుకల ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మెడికల్ సూపరింటెండెంట్ కల్యాణ్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. మహిళా పారామెడికల్ సిబ్బందికి టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, డిస్పెన్సరీకి వచ్చే డయాబెటిక్ రోగులకు విశ్రాంతి గది, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా ప్రతినిధి రాణి, ఫార్మాసిస్ట్ మంగ, భాస్కర్, స్టాఫ్ నర్సు శ్వేత, అనూష్, వార్డు అసిస్టెంట్ రమేశ్, తిరుపతి, రమేశ్, మధు, నాగరాజు ఉన్నారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై సత్యనారాయణ

ధర్మారం: జక్కన్నపల్లి వద్ద మంగళవారం ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఆధారాలు లేకుండా ముగ్గురు వాహనదారుల నుంచి రూ.2,55,300 స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన పాకాల కుమారస్వామి వద్ద రూ.85,500, రామడుగుకు చెందిన కోయల్‌కార్ ఈశ్వర్ వద్ద రూ.82,000, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొండ్రాపూర్‌కు చెందిన బానోత్ రవి వద్ద రూ.87,800 స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

కల్వచర్లలో..

రామగిరి: కల్వచర్ల గ్రామంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.1,01,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు. తగిన ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

రూ.54వేల నగదు స్వాధీనం

పాలకుర్తి: కన్నాల టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి పోలీసులు రూ.54వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ప్రశాంత్ గోదావరిఖనికి వెళ్తుండగా ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో వాహనం తనిఖీ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. తగిన ఆధారాలు లేకపోవడంతో సీజ్‌చేశారు.

ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

గోదావరిఖనిటౌన్: ఆర్టీసీ గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం సంస్థ నిర్ణయం మేరకు ప్రయాణికులకు దసరా పండుగ సందర్భంగా బంపర్ ఆఫర్ ప్రకటించారు. 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు టికెట్ వెనకాల తమ పేరు, ఫోన్ నెంబర్ రసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సులో వేయాలని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ప్రతి రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9900 విలువ గల బహుమతులను టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ భర్త

రామగుండం: రామగుండం 21వ డివిజన్ కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా భర్త సలీంబేగ్ కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సోదరుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఠాకూర్ అయోధ్యసింగ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, ఓదెల మొగిలి, గౌస్‌పాషా, వెంకట్రాజం, రవి, బల్వాన్‌సింగ్‌ఠాకూర్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గోదావరిఖనిటౌన్: పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ అల్లి శ్రీనివాస్ కూతురు అనారోగ్యంతో బాధపడుతోంది. కాగా ఆమె చికిత్స కోసం మంగళవారం ఆటో యూనియన్ కార్యాలయంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు తానిపర్తి గోపాల్‌రావు చేతుల మీదుగా రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారు దయానంద్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ఈర్ల అయిలయ్య, నాయకులు మారుపాక శ్రీనివాస్, బిరియాని వేణుగోపాల్, బండారు రవికుమార్, సతీశ్, శ్రీనివాస్, శ్రీపతి మొగిలి, తిరుపతి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కోరుకంటి చందర్ గెలుపునకు కృషిచేయాలి

పాలకుర్తి: బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ అభ్యర్థి కోరుకంటి చందర్ గెలుపు కోసం కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు కౌశికహరి కోరారు. పాలకుర్తి మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఈసాలతక్కళ్లపల్లిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌశికహరి మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన చందర్‌ను గెలిపించుకునేందుకు పనిచేయాలని పిలుపునిచ్చారు.

లాభాల వాటా జయచేయాలి

రామగిరి: సింగరేణి యాజమాన్యం ప్రకటించిన లాభాల వాటాను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని హెచ్ఎంఎస్ ఏఎల్‌పీ బ్రాంచ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఎల్‌పీ గనిలో కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం 16న లాభాల వాటాను కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపి ఎన్నికల కోడ్ పేరుతో కార్మికులను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని కల కోడ్‌కు, లాభాల వాటాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. లాభాల వాటాను కార్మికుల ఖాతాల్లో జమచేయాలని, లేకపోతే హెచ్ఎంఎస్ పక్షాన ఆందోళన చేస్తామన్నారు. వైస్‌ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్‌రావు, సెంట్రల్ కమిటీ సభ్యులు అశోక్, బ్రాంచ్ సెక్రెటరీ క్రాంతికిరణ్, పిట్ సెక్రెటరీ రంజిత్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



ప్రచారంలో దాసరి సతీమణి పుష్పలత

జూలపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి పుష్పలత అన్నారు. జూలపల్లిలో మంగళవారం ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. మండల వైస్ చైర్మన్ రమేశ్, సర్పంచులు ఎల్లయ్య, రాధ, కొత్త శకుంతల, ఎంపీటీసీలు పల్లె శ్రీలత, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కంది చుక్కారెడ్డి, తొంటి బుచ్చన్న, తొగరు శ్రీనివాస్, రాంగోపాల్‌రెడ్డి, నాడెం మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో మరోసారి బీర్ఎస్‌కు ఓటు వేసి అండగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కోరారు. పెద్దపల్లిలోని 13వవార్డులో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ పాగాల సోని, శ్రీకాంత్, పూదరి చందు ఉన్నారు.

మూడోసారి కారు గెలుపు ఖాయం

ఓదెల: పెద్దపల్లిలో మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి గెలుపు ఖాయమని పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల డైరెక్టర్ బండారి ఐలయ్య యాదవ్ అన్నారు. మండలంలోని కొలనూర్‌లో మంగళవారం రైల్వేస్టేషన్ ఏరియా నుంచి గ్రామంలోని పలువార్డుల్లో బీఆర్ఎస్ ప్రచారం ప్రారంభించారు. సర్పంచ్ సామ మణెమ్మ, మాజీ సర్పంచ్ డిల్లీ శంకర్, ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, కొలనూర్ ఆలయ చైర్మన్ కలకొండ రాజిరెడ్డి, నాయకులు చంద్రు, రమేశ్, శేఖర్, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

సుల్తానాబాద్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి అన్నారు. పట్టణంలోని ఆరెపల్లి, శ్రీరాములపల్లి పూసాలలో ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా నాయకుడు రంగారెడ్డి, రమేశ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, గోపి, తిరుపతి, మమత, సంపత్, సాజిత్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ లాభాల వాటా చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల లాభాల వాటా వెంటనే చెల్లించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని అన్నిగనులపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నాయకుడు సదానందం పాల్గొన్నారు.

✦ లాభాల వాటా నిలిపివేయడం సరికాదు

గోదావరిఖని: ఎన్నికల కోడ్ పేరిట లాభాల వాటా నిలిపివేయడం సరికాదని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఏరియా హాస్పిటల్ ఏసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.

✦ కల్చరల్‌మీట్ పోటీలు ప్రారంభం

గోదావరిఖని: ఆర్జీ–1, 2 ఏరియా కల్చరల్ మీట్ పోటీలు మంగళవారం స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం సీఈఆర్ క్లబ్‌లో జరిగాయి. టీటీసీ మేనేజర్ వెంకటరమణ పోటీలు ప్రారంభించారు. ఆర్జీ–1 నుంచి 24 మంది, ఆర్జీ–2 నుంచి 27 మంది కళాకారులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన బృందాలను కంపెనీస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్థ గౌరవ కార్యదర్శి సారంగపాణి, రమేశ్, నరేందర్, రాజయ్య, స్వామి, శంకర్, సుశీల, సతీశ్‌కుమార్, హమీద్ పాల్గొన్నారు.

✦ డిస్మిస్ కార్మికులకు అవకాశం

రామగిరి:సింగరేణిలో 2019 జనవరి ఒకటి నుంచి 2022 డిసెంబర్ 31 మధ్య వివిధ కారణాలతో డిస్మిస్ అయిన ఉద్యోగులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సింగరేణి నిబంధనల ప్రకారం హైపవర్ కమిటీ సమీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోందన్నారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 46 ఏళ్లు, అంతకన్నా తక్కువ వయసు కలిగి ఉండాలన్నారు. డిస్మిస్ అయిన కాలానికి ముందు ఐదేళ్లలో ఏవైనా రెండేళ్లలో కనీసం 100 మస్టర్లు కలిగి ఉండి, బదిలీ వర్కర్, కేటగిరీ–1గా తిరిగి నియామకం కోసం తగిన మెడికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని సూచించారు.

✦ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: సింగరేణి సంస్థ సివిల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రసిడెంట్ కనుకుల మొండయ్య కోరారు. మంగళవారం సెంటినరీకాలనీలో సింగరేణి 11 డివిజన్లకు చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సమావేశమయ్యారు. అనంతరం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

✦ ఆర్థిక చేయూత

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు చెందిన జ్యోతి అనే టీచర్ కొన్నిరోజుల క్రితం మృతిచెందింది. కాగా బాధిత కుటుంబానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లచ్చయ్య కరీంనగర్ జిల్లా కేంద్రంలో రూ. లక్ష చెక్కు అందించారు. పీఆర్టీయూ టీఎస్‌లో సభ్యత్వం ఉన్నందున పీఆర్టీయూ టీఎస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందించినట్లు తెలిపారు.

✦ ఏసీపీ విచారణ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్, శానగొండ గ్రామాల్లో పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుపై ఏసీపీ మహేశ్ మంగళవారం విచారణ చేపట్టారు. ఆయా గ్రామాల్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై శ్రీధర్ ఉన్నారు.

✦ కర్నాటకలో గ్యారంటీ పథకాలు అమలు

మంథని: కర్నాటకలో గ్యారంటీ పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలవుతాయని కర్నాటకు చెందిన మహిళా కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు వనిల్ల సూర్యవంశీ అన్నారు. మంథనిలోని పెంజేరుకట్టతో పాటు పలువీధుల్లో మంగళవారం ప్రచారం చేశారు. మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, మాజీ జెడ్పీటీసీ మూల సరోజన, సుగుణ, నిహారిక, నామని సుగుణ, పద్మ ఉన్నారు.

✦ జీడీకే–8–ఏ ప్రమాద మృతులకు నివాళి

గోదావరిఖని: సరిగ్గా ఇరువైఏళ్ల క్రితం జీడీకే–8ఏ గని ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు మంగళవారం నివాళి అర్పించారు. ఓసీపీ–3 కృషిభవన్ ఆవరణలోని స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు ఐలి శ్రీనివాస్, కొంగర రవీందర్, బీఎంఎస్ నేత యాదగిరి సత్తయ్య, ఐఎన్‌టీయూసీ నేత సంపత్‌రెడ్డి, ఏఐటీయూసీ నేతలు రాజరత్నం, ప్రకాశ్, సీఐటీయూ నాయకుడు ఉల్లిమొగిలి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి



ప్రచారం చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి కోరారు. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ లక్ష్మీనగర్ ఏరియాలో మంగళవారం నిర్వహించిన గడప గడకూ కాంగ్రెస్ ప్రచారం చేశారు. డివిజన్ అధ్యక్షుడు మార్క రాజు, ఇన్‌చార్జి దేవసపల్లి చక్రపాణి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, ఓదెలు, సారయ్య నాయక్, సతీశ్, సర్వోత్తమరెడ్డి, రవి, సంపత్, ఫయాజ్ పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై ఇంటింటా ప్రచారం

పాలకుర్తి: మండలంలోని కన్నాల, శాలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సదర్భంగా మహిళా న్యాయవాదులు బతుకమ్మ పూర్చి ఆడిపాడారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



జ్యోతినగర్: పూజల్లో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి/ఎలిగేడు/మంథని/జ్యోతినగర్/ఓదెల: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా జిల్లాలో కొలువుదీరిన దుర్గామాతలు మంగళవారం మూడోరోజు శ్రీగాయత్రి దేవిగా, అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.